సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ ఆదేశించారు. బుధవారం సర్వేను దంతాలపల్లి, కురవి, బయ్యారం, గూడూరు, డోర్నకల్, నెల్లికుదురు, తొర్రూరు, చిన్న గూడూరు, గార్ల మండలాల్లో ప్రారంభించారు. గార్లలో జరిగిన కుటుంబ సర్వేను డీపీఓ ప్రారంభించి మాట్లాడుతూ 70 అంశాలతో కూడిన సమగ్ర సమాచారంతో సర్వే జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. ముందుగా ఇంటింటికి స్టిక్కర్ అంటించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్


గార్ల : సర్వేను పర్యవేక్షిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్


కురవి : ఇంటికి వెళ్లి కుటుంబ యజమాని వివరాలు తెలుసుకుంటున్న అధికారులు


డోర్నకల్ : గ్రామాల్లో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌నాయక్


తొర్రూరు : ఓ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ఉపాధ్యాయురాలు

క్లుప్తంగా

శివయ్యకు వెండి కోరమీసాల బహూకరణ



మరిపెడ : మున్సిపాలిటీలోని భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలోని శివలింగానికి భక్తులు వెండి కోరమీసాలు బహూకరించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గుంటూరు వాసులు రుద్రాక్షాల లీలాకుమార్, శోభారాణి దంపతులు గతంలో ఈ ఆలయంలో కోరిన కోరికలు నెరవేరడంతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నవీన్, ఆలయ చైర్మన్ కొంపెల్లి సురేందర్‌రెడ్డి, కార్యదర్శి లక్ష్మారెడ్డి, కోశాధికారి వెంకన్న, రమేష్, వీరభద్రం, శివయ్య, చెన్నూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిరావాలి

నెల్లికుదురు: తొర్రూరులో బుధవారం నిర్వహించే నూతన వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారానికి మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డీసీసీ ప్రధానకార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు గుగులోతు బాలాజీనాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలం నుంచి కాలేరు మల్లేశం, యాకసాయిలు, నరేందర్, భాస్కర్‌లను డైరెక్టర్లుగా నియమించినట్లు తెలిపారు.

పెద్దమ్మగుడి నిర్మాణానికి భూమి పూజ

నెల్లికుదురు: మండల కేంద్రంలో ముదిరాజ్‌ల ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి మత్స్యకారులు, ముదిరాజ్‌లు బుధవారం భూమి పూజ నిర్వహించారు. రూ.15లక్షలతో ఆలయ నిర్మాణానికి ముదిరాజ్‌లు సంయుక్తంగా ముందుకు వచ్చి నిర్మాణానికి పూనుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కురవి: మండలంలోని అయ్యగారిపల్లిలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జగన్‌రెడ్డి, నాగన్న, సుఖేందర్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ దేశ్‌ముఖ్, బజ్జూరి చైతన్యరెడ్డి, సంజీవరెడ్డి, మహ్మద్‌పాషా, వేమిశెట్టి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

కురవి : సీరోలు మండలం కొత్తూరు(సీ)లో నిరుపేద వెంకన్న కుటుంబానికి కురవికి చెందిన యూ ట్యూబర్ గంగరబోయిన రఘు నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. వెంకన్న గుండె జబ్బుతో బాధపడుతుండగా భార్య వదిలేసి వెళ్లిపోయింది. పెద్ద కుమార్తె మానస వివాహాన్ని గ్రామస్తుల సహకారంతో చేశారు. చిన్న కుమార్తె మౌనిక పదో తరగతి చదువుతూ సెలవుల్లో కూలిపనికి వెళ్లి కుటుంబాన్ని పోషిస్తుంది. కార్యక్రమంలో గూడూరు సంతోష్, బండారు కార్తీక్, కటుకూరి యాకయ్య పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పెద్దవంగర: పర్యావరణాన్ని ప్రతీ ఒక్కరూ పరిరక్షించాలని చిట్యాల క్లస్టర్ హెచ్‌ఎం ఎర్రోజు విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల్లో కౌన్సిల్ ఆఫ్ గ్రీన్ రెవ్యూలేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యంగ్‌ఎర్త్ లీడర్ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నగేష్, శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ కళాజాతా

నర్సింహులపేట : మండలంలోని రామన్నగూడెంలో బుధవారం రాత్రి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై కళాజాతా నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజలు మూఢనమ్మకాలను నమ్మొద్దని, మత్తు పదార్థాలను వాడొద్దని, బాల్య వివాహాలు చేయవద్దని కళాజాత ద్వారా వివరించారు. ఎస్సై మాలోతు సురేష్, సిబ్బంది, కళాజాత బృందం పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించడంలో విఫలం

గార్ల: మండలంలో ఇటీవల వరదలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న ఆరోపించారు. బుధవారం రాంపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 50 మందికి మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపుకుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాగరాజు, నగేష్, రమేష్, వెంకటనర్సమ్మ, వీరస్వామి, సరిత, చిరంజీవి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండా

మహబూబాబాద్ రూరల్ : గోదావరిలోయ పరివాహక ప్రాంతంలో 50 ఏళ్లుగా విప్లవకారుల ఆధ్వర్యంలో లక్షలాది ఎకరాల పోడు భూ ములను కొట్టించి ఆదివాసులు, గిరిజనులు, ఇతర పేద ప్రజలకు పంచిపెట్టారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆరెల్లి కృష్ణ అన్నారు. సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నవంబర్ 1 నుంచి 9 వరకు గ్రామ గ్రామాన అమర వీరుల వర్ధంతి సభలు జరపాలని పిలుపునివ్వగా మండలంలోని కంబాలపల్లిలో సురేషన్న, కామ్రేడ్ సైదులన్న స్మారక వర్ధంతి సభ బుధవారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యూడెమోక్రసీ కృష్ణ మాట్లాడుతూ భూ పోరాటం ప్రజా సమస్యలపై జరుగుతున్న పోరాటంలో ప్రభుత్వ నిర్బంధ కాండలో ఎంతోమంది వీరమరణం పొందారన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించడం అంటే వారు చూపిన బాటలో పయనించి వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లినప్పుడు మాత్రమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. సభలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మొగిలి ప్రతాప్ రెడ్డి, న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మదార్, ఎస్.కే.బాబన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు అప్పారావు, రాంసింగ్, పీడీఎస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ, షర్ఫుద్దీన్, రామచంద్రు, ఉపేందర్, దేవేందర్, గణేష్, అరుణోదయ రాష్ట్ర నాయకులు పాపన్న, అశోక్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆరెల్లి కృష్ణ

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలం

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలం చెందిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని వెలికట్ట, గుడిబండ తండల్లో ఉన్న ధాన్యం రాశులను పరిశీలించి, రైతులతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, ప్రభుత్వం ఇస్తామన్న రూ.500 బోనస్ వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ ఇప్పటికే చేతికి వచ్చిన వరి ధాన్యాన్ని కేంద్రాల్లోకి రాశుల కొద్దీ తీసుకెళ్లి రోజుల తరబడి ఆరబెడుతున్న ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించి, కనీసం సన్నవడ్లకైనా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్, నాయకులు నలమాల ప్రమోద్‌గౌడ్, ఎస్‌కే అంకూస్, తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం రాశుల వద్ద రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దామని శాస్త్రీయ విద్యను సాధిద్దామని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థి సంస్మరణ సభకు ఆయన హాజరై మాట్లాడుతూ విద్యాలయాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించుటకై, సమాజంలో ఉన్న అసమానతలు తొలగిపోవాలని, సమ సమాజ స్థాపనకై అసువులు బాసిన విద్యార్థి అమరవీరులు జార్జి రెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, చేరాలు, కోలాశంకర్ అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కంపాటి పృథ్వి, సీపీఐ ఎంఎల్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, మాజీ రాష్ట్ర నాయకులు పైండ్ల యాకయ్య, జిల్లా నాయకులు గణేష్, సుహిత, జస్వంత్, జగదీష్, పండు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను సాధిద్దాం

గార్ల: అమరవీరుల ఆశయాలను సాధించేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు జడ సత్యనారాయణ అన్నారు. అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం మండలం లోని పెద్దకిష్టాపురంలో అమరవీరుల స్తూపం వద్ద ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పాక వెంకన్న, పాక వీరన్న, రమేష్, ఉప్పలయ్య, పాల్గొన్నారు.

కురవి: అమరవీరుల ఆశయాలను సాధించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హాలావత్ లింగన్న అన్నారు. బుధవారం మండలంలోని రాజోలు శివారు బాలు తండా గ్రామంలో మాలోత్ ఆలా స్మారక స్తూపంపై జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు పాపయ్య, దేవేందర్, కోబాల్, రవి, వీరన్న, వాల్యా, శంకర్, వెంకటాద్రి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


మహబూబాబాద్ అర్బన్ : సంస్మరణ సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

పోలీస్‌స్టేషన్ ప్రారంభం



పెద్దవంగర: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మరో చోటుకు మార్చగా బుధవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి వచ్చిన ఎస్పీకి ముందుగా పోలీసులు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దిన సీఐ జగదీష్, ఎస్సై క్రాంతికిరణ్‌ను అభినందించారు. అనంతరం పోలీస్‌శాఖ, లయన్స్‌క్లబ్ పెద్దవంగర ఆధ్వర్యంలో చేపట్టిన హెల్మెట్ వినియోగంపై అవగాహనకు సంబంధించిన స్టిక్కరింగ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణ కిశోర్, సీఐ జగదీష్, తొర్రూరు, దంతాలపల్లి, నర్సింహులపేట ఎస్సైలు ఉపేందర్, రాజు, సురేష్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్, అమృతరెడ్డి, సతీష్, లక్ష్మీనారాయణ, మధుసూదన్ రెడ్డి, అనపురం రవి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు శ్రీసత్య లయన్స్ చారిటబుల్ సేవలు

మహబూబాబాద్ రూరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెఫర్డ్, శ్రీసత్య లయన్స్ చారిటబుల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలంలోని మోట్లతండాలో బుధవారం ఉచిత కంటి పరీక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు మాజీ సర్పంచ్ సుమన్ నాయక్ ఆధ్వర్యంలో బిస్కెట్ల పాకెట్లు పంపిణీ చేశారు. ఆస్పత్రి మేనేజర్ ధారావత్ బాలునాయక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని శ్రీసత్య లయన్స్ చారిటబుల్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు ఉచిత ఆపరేషన్లు, ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు, క్యాట్రాక్ కంటి ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెఫర్డ్ చైర్మన్ లయన్ డాక్టర్ సురేష్, సెక్రటరీ రెడ్డినాయక్, కంటి సహాయ వైద్యులు అఖిల్ నాయక్, మాజీ సర్పంచ్ సుమన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరం నిర్వహిస్తున్న మేనేజర్ బాలునాయక్

ఎస్సారెస్పీ కాల్వను పరిశీలించిన డీఈ

నెల్లికుదురు : మండలంలోని రాజులకొత్తపల్లిలో నిరుపయోగంగా ఉన్న ఎస్సారెస్పీ కాల్వను ఐబీ డీఈ రాందాస్, ఏఈ వినయ్‌కుమార్ బుధవారం రైతులతో కలిసి సందర్శించి పరిశీలించారు. గ్రామ యువకులు కాల్వ నీరు రాక పంటపొలాలు ఎండిపోతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. కాల్వకు ఇరువైపుల ఉన్న భూములను సాగు చేస్తూ నీరు రానివ్వలేరన్నారు. కాల్వ భూములు ఆక్రమించుకుంటే చర్యలు తప్పవని త్వరలో సమస్య పరిష్కరించి కాల్వ నీరు పంటల సాగుకు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువకులు అశోక్, భూపాల్, వినేష్, సంతోష్, శ్రీను పాల్గొన్నారు.


ఎస్సారెస్పీ కాల్వను పరిశీస్తున్న డీఈ, ఏఈలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కేసముద్రం : రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని గాంధీపురం జీపీ సమీపంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇనుగుర్తి మండలం కోమటిపల్లి శివారు తారాసింగ్‌తండా జీపీకి చెందిన రమావత్ స్వామి తన బైక్‌పై మానుకోట వైపునకు వెళ్తుండగా, కల్వలకు చెందిన నాంపల్లి సతీష్ బైక్‌పై మానుకోట నుంచి కల్వల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గాంధీపురం సమీపంలో ప్రమాదవశాత్తు రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో కిందపడిపోయిన స్వామి, సతీష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కల్వర్టు, సీసీ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ వీరన్న

డోర్నకల్: స్థానిక నాల్గవ మెయిన్ రోడ్డులో కల్వర్టు, సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న బుధవారం శంకుస్థాపన చేశారు. కొద్ది రోజుల క్రితం రైల్వేశాఖ రైల్వే గెస్ట్ హౌజ్ రోడ్డు నుంచి సుభాష్‌వీధీ విగ్రహం వరకు తమ పరిధిలోని రోడ్డు చివరన డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టింది. దీంతో పలు ప్రధాన దారుల నుంచి రైల్వే స్టేషన్ రోడ్డుకు రాకపోకలు నిలిచాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల విన్నపం మేరకు రైల్వే డ్రెయినేజీ నాలుగుదారుల్లో కల్వర్టులు నిర్వహించి రాకపోకలు కొనసాగించేందుకు అధికారులు అనుమతించారు. కల్వర్టు, సిమెంటు రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.3.50 లక్షలు స్థానికులు సమకూర్చడం గమనార్హం. డోర్నకల్ అధ్యక్ష మండల పీఠాధిపతి డాక్టర్ కె.పద్మారావు, కౌన్సిలర్ భాగ్యలక్ష్మీశ్రీనివాస్, శ్రీరాంనాయక్, వీరాచారి, మహేష్, అనంతాచారి, శ్రీనివాస్, కిషోర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బియ్యం అందజేత

కేసముద్రం: మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే.జానీ బేగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబానికి టీపీసీసీ ఓబీసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ వీరన్నయాదవ్ సహకారంతో 50కిలోల బియ్యాన్ని బుధవారం నాయకులు అందజేశారు.

సన్మానం

గూడూరు: గెజిటెడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్‌టీఓ మహ్మద్ రఫీని బుధవారం స్థానిక కార్యాలయంలో కొత్తగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. అనంతరం రఫీ మాట్లాడుతూ కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు శ్రద్ధతో విధులు నిర్వహించాలన్నారు.

పాటలతో అలరించిన 'బలగం' కొమరమ్మ

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి శివారు మెగ్యాతండాలో ఓ వరి విత్తనం కంపెనీ ఆధ్వర్యంలో పంటలసాగుపై నిర్వహించిన అవగాహన సదస్సుకు బలగం సినిమా గాయని మొగిలి దుగ్గంటి కొమరమ్మ పాడిన పాటలు అందర్ని అలరించింది.

పాఠశాలలో అన్నదాన కార్యక్రమం

కేసముద్రం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో వోలం జనార్దన్, నీలిమా, ఆకాశ్ 24వ వర్ధంతి సందర్భంగా బుచ్చిలింగం దంపతులు, పెద్దకుమారుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అర్హులైన పేదలను గుర్తించాలి

మహబూబాబాద్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అర్హులైన పేదలను గుర్తించాలని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కుర్ర మహేష్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఎంపీడీఓ రఘుపతిరెడ్డికి వినతి పత్రం అందజేసింది.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మహబూబాబాద్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు బుధవారం కలెక్టరేట్ ఎదుట మహాదీక్షను నిర్వహించారు. 16 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

దంతాలపల్లి : రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కందగట్ల యాకన్న అన్నారు. మహబూబాబాద్‌లో బుధవారం నిర్వహించిన ధర్నాకు పంచాయతీ కార్మికులు తరలి వెళ్లారు.

కులగణనతో బీసీల సంబురాలు

మహబూబాబాద్ అర్బన్ : తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి బీసీ కులగణన నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు మున్నేరు వాగులో జలాభిషేకం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 70 ఏళ్లుగా దేశ,రాష్ట్ర ఆర్థిక రంగానికి ఆర్థిక వెన్నుముకగా ఉన్న బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి పోయారన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

తొర్రూరు/కేసముద్రం: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తొర్రూరు, కేసముద్రం ఎస్సైలు మురళీధర్‌రాజు రాంజీనాయక్ అన్నారు. వారు మాట్లాడుతూ చట్టాలపై సైబర్ నేరాలకు గురికావద్దని, ఇంట్లో కుటుంబ సభ్యులకు ఇలాంటి నేరాలపై అవగాహన కల్పించాలన్నారు.

ప్రతీ పుట్టినరోజున మొక్క నాటాలి

బయ్యారం: విద్యార్థులు తమ ప్రతీ పుట్టినరోజున ఒక మొక్క నాటాలని వై.వెంకట్‌రెడ్డి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చెట్ల ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాలల ఆవరణంలో ఉన్న పెద్ద చెట్లకు విద్యార్థులు పూజలు నిర్వహించాలన్నారు.

గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలి

బయ్యారం: గ్రామసభలు నిర్వహించి ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ నాయకులు రాజన్న, మధు మాట్లాడుతూ గ్రామసభ ద్వారా పూర్తి పారదర్శకంగా ఎంపిక నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తే దేశ భవిష్యత్‌కు ఎంతో దోహదపడుతుందని ఎస్ ఎక్స్ ప్లోర్స్ ఓరియంటేషన్ స్మైల్ ఫౌండేషన్ మేనేజర్ కిషోర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో 26 పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులతో స్మైల్ ఫౌండేషన్ న్యూ ఢిల్లీ వారిచే బుధవారం ఓరియంటేషన్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో 6, 7 తరగతుల పిల్లల కోసం షెల్ ఇండియా సహకారంతో నిర్వహిస్తూ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం తోడ్పాటు అందిస్తుందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

కేసముద్రం: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం ఇనుగుర్తిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16, 17వ తేదీల్లో డోర్నకల్‌లో జరిగే పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మరిపెడ రూరల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే సంపూర్ణమైన ఆరోగ్యం కలుగుతుందని మరిపెడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి సూచించారు. బుధవారం ఎల్లంపేట స్టేజి వద్ద జనవికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.

సర్వేలో ఎరుకుల పేరును నమోదు చేసుకోవాలి

కురవి: కులగణన సర్వేలో ఎరుకుల కులానికి చెందిన వారు ఎస్టీ బ్రాకెట్‌లో ఎరుకుల అనే అని నమోదు చేసుకోవాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకుల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మిరప తోటల పరిశీలన

నర్సింహులపేట : నర్సింహులపేట శివారు పిచ్చిరాంతండాలో బుధవారం మిరప తోటలను ఏఓ వినయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చిలో కాండం కుళ్లు తెగులును, కొమ్మ కుళ్లు తెగులును గుర్తించారు. కాండం కుళ్లు సోకిన మొక్కలకు కాండం మొదలు భాగంలో కాండంపై తెల్లగా బూజు పదార్థం కనిపిస్తుందన్నారు. నివారణకు మొక్క తడిచేలా మెటలాక్సిల్ 3.3 శాతం, క్లోరోతాలోనిల్ 33.1 శాతంను లీటర్ నీటికి రెండు మీ.లీ చొప్పున పిచికారీ చేయాలన్నారు. కొమ్ము కుళ్లు తెగులుకు మెటీరం 55 శాతం, పైర్ క్లోరోస్ట్రోబిన్ 5 శాతం, డబ్ల్యూజీ ఎకరాకు 500 గ్రాముల చొప్పున స్ప్రే చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు

గూడూరు : కార్తీకమాసంలో ప్రతీ రోజు భక్తులు ఉదయం, సాయంత్రం అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. బుధవారం నాగపంచమిని పురస్కరించుకొని ముందుగా ఆలయంలో ఏకశిలపై కొలువున్న శివపార్వతులను దర్శించుకున్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

మరిపెడ రూరల్: మండలంలోని గుండెపుడిలో తలపెట్టే సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అలువాల వీరయ్య అన్నారు. గుండెపుడిలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశం దుండి వీరన్న అధ్యక్షతన బుధవారం జరిగింది. సభకు పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ హాజరు కానున్నట్లు తెలిపారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

మహబూబాబాద్: అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 12 వార్డులోని అంబేడ్కర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిదుల నుంచి రూ .5 లక్షలతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ప్రజలు కూడా అన్ని విధాలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్, డీఈ సీహెచ్ ఉపేందర్, నాయకులు కృష్ణ, రేఖ భర్తయ్య, తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడుతున్న చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

పర్యావరణాన్ని కాపాడుదాం

మహబూబాబాద్ అర్బన్ : భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించేందుకు పర్యావరణాన్ని కాపాడుదామని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ వై.వెంకట్రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో బుధవారం యూత్ ఎర్త్ క్లబ్స్ లీడర్స్ కార్యక్రమం నిర్వహించారు. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మొక్కల సంరక్షణపై ఔషధ మొక్కల పట్ల ప్లాస్టిక్ వాడకంతో జరిగే అనర్థాలను తెలుసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలోని ఒక చెట్టును మదర్ ట్రీగా ఎంపిక చేశారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనుదీప్, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.


పాఠశాలలో ఏర్పడిన యూత్ ఎర్త్ క్లబ్స్ లీడర్స్